క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

సీతంపేట: ఈ ఏడాది ఇంటర్మీడియట్ పూర్తి చేస్తున్న వారంతా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.ప్రభాకర్ సూచించారు. ఓపెన్ డే కార్యక్రమంలో భాగంగా స్థానిక గురుకుల బాలురు, బాలికల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులతో శుక్రవారం సమావేశమైన ఆయన డిగ్రీ కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను అందుబాటులోకి తెచ్చి, ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఇంటర్న్‌షిప్, కళాశాలలోని మౌలిక సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు రవికిరణ్‌కుమార్, చంద్రభూషణం తదితరులు పాల్గొన్నారు.

రూ.1.13 లక్షలకు వాహనాల వేలం



వాహనాల వేలంపాట నిర్వహిస్తున్న సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం వాహనాల వేలం నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్, ఎస్‌ఐ కళాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంపాటలో 10 ద్విచక్ర వాహనాలు, ఓ ఆటోను మొత్తం రూ.1.13 లక్షలకు దక్కించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పాలకొండ రూరల్: మండలంలోని వడమ-అన్నవరం రోడ్డులోని తమ కార్యాలయం వద్ద పలు ఎస్‌ఈబీ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు జరిగే ఈ వేలంపాటలో పాల్గొని, 14 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు దక్కించుకోవాలని కోరారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా ఇవ్వాలి



అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందజేయాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు సూచించారు. శుక్రవారం మండలంలోని తుమరాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన కేంద్రంలో లబ్ధిదారులకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం పనుకువలస, తుమరాడ గ్రామ సచివాలయాలను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వృద్ధుడి బీపీ చెక్ చేస్తున్న వైద్యుడు

పాలకొండ రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కడియం చిరంజీవి అన్నారు. శుక్రవారం మండలంలోని సింగుపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, 138 మందికి బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.రవికుమార్, డీఈఓ విస్సు, ఏఎన్‌ఎంలు జి.శోభారాణి, టి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో సమస్యలు పరిష్కారం



భూముల రీసర్వే పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శివున్నాయుడు

గరుగుబిల్లి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూసమస్యలు పరిష్కారమవుతున్నాయని డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శివున్నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించిన ఆయన పక్కగా సర్వే చేపట్టాలని సూచించారు. వీలైనంత వరకు రైతుల సమక్షంలోనే సరిహద్దుల గుర్తింపు చేపట్టాలన్నారు.

జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దాం..

- మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం:

రాబోయే ఎన్నికల్లోనూ అందరం సమష్టిగా పనిచేసి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పిలుపునిచ్చారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బీఎస్‌ఆర్ కళింగవైశ్య కల్యాణ మండపంలో గృహసారథులతో సమావేశమైన ఆమె 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ప్రతిపక్షాల దుష్ప్రచారకీయాలు, ఎల్లోమీడియాలో వస్తున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రసారాలను తిప్పికొట్టాలన్నారు. ఏది నిజమో ఏది అబద్ధమో ప్రజలకు తెలియజేయాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను వివరించాలన్నారు. మార్చి 18 నుంచి 25వ తేదీ వరకు చేపట్టే 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా గృహసారథులంతా ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వివరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎలా తూ.చ తప్పకుండా అమలు చేశారో తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలో పార్టీకి కంచుకోటగా ఉన్న గుమ్మలక్ష్మీపురం మండలం నేతలు, కార్యకర్తలు ఎటువంటి పార్టీ పదవులు ఆశించకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తుండడం చాలా ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని కూడా ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏడుగురు రెగ్యులర్ వైద్యులను నియమించి, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. అంతేకాకుండా రూ.9 కోట్ల వ్యయంతో ఆస్పత్రి ఆవరణలో అధునాతన భవనాలు నిర్మిస్తున్నామన్నారు. పోస్టుమార్టం కేంద్రం కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కనీసం రోడ్డు సౌకర్యం లేని దేరువాడ-బీరుపాడు గ్రామాలకు దాదాపు రూ.16 కోట్ల వ్యయంతో పక్కా రోడ్డు నిర్మించిన సంగతి, ఆర్టీసీ బస్సు సర్వీసును కూడా కల్పించిన విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు గాను 175 స్థానాలు గెలుస్తామని సీఎం అంటున్నారని, కానీ ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాత్రం తమ పొత్తుల అనంతరం ఎవరు ముఖ్యమంత్రి అవుతారు, ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తారో చెప్పుకునే స్థాయిలో కూడా లేరని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గొరిశెట్టి గిరిబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్-175 లక్ష్యంగా పనిచేద్దాం



పాలకొండ: మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు దోల జగన్

- మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు డోల జగన్, ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: టార్గెట్-175(రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు) లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దామని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు డోల జగన్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశమైన వారు 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి,వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, ఎంపీపీ బొమ్మాళి భాను పాల్గొన్నారు.

భామిని: మండలంలోని బాలేరు గ్రామంలో శుక్రవారం జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశానికి పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు డోల జగన్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరై, 2024లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని సూచించారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలని ఎస్‌ఐ బి.శివప్రసాద్ కోరారు. శుక్రవారం పాలకొండ- వీరఘట్టం రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టిన ఆయన నిబంధనలు అతిక్రమిస్తూ వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని, కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి, మితిమీరిన వేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో మద్యం సేవించి, వీరంగం సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పెండింగ్ డీఏలు చెల్లించండి

జియ్యమ్మవలస: పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీతారామయ్యకు ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, ప్రతినెలా ఒకటో తేదీనాడే జీతాలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మిన్నాజోలలో శివరాత్రి పూజలు

భామిని: త్రివేణి సంగమ ప్రాంతమైన మండలంలోని మిన్నాజోల గ్రామ శివకేశవుల సన్నిదిలో భక్తులు శివరాత్రి పూజలు శుక్రవారం నిర్వహించారు. శనివారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, అక్కడి పవిత్ర వంశధార నదిలో భక్తులు స్నానాలు ఆచరించి, శివునికి విశేష పూజలు చేశారు.

మల్లిఖార్జునస్వామికి ప్రత్యేక పూజలు

భామిని: మండల కేంద్రంలో వెలసిన ఉమా సహిత మల్లిఖార్జునస్వామికి భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. ఆ తర్వాత దగ్గరలోని వంశధార నదీతీరంలో చక్రతీర్థ స్నానాలు ఆచరించారు.



వంశధార నదీతీరంలో మల్లిఖార్జునస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు



రోగుల సేవలపై ఆరాతీస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహన్‌రావు

కొమరాడ: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునేజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని ఆర్తాం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యారోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమం నిర్వహిస్తున్న తీరును పరిశీలించిన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామీణులకు చైతన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు ఎం.శిరీష తదితరులు పాల్గొన్నారు.

256 లీటర్ల సారా ధ్వంసం

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన 256 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ కళాధర్ శుక్రవారం తెలిపారు. గతంలో పట్టుబడిన 17 మద్యం బాటిళ్లను కూడా ధ్వసం చేశామని ఆయన పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు మండల కేంద్రంలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, పాఠశాలల విలీనం నిలిపివేయాలని వారు కోరారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, రమణ, సూర్యనారాయణ, జయప్రద, పద్మజ పాల్గొన్నారు.

కుమ్మరులను ఆర్థికంగా ఆదుకోవాలి



ఎమ్మెల్యే కళావతికి వినతిపత్రం ఇస్తున్న మండల కుమ్మర సంఘ ప్రతినిధులు

భామిని: మట్టికుండల తయారీని జీవనోపాధిగా చేసుకుని జీవిస్తున్న కుమ్మరులను ఆర్థికంగా ఆదుకోవాలని మండల శాలివాహన కుమ్మర సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని కోరారు. ఇదే విషయమై శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ కులస్తులను కూడా ఆదుకునేలా చూసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే కుమ్మరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

గృహసారథులే గెలుపు వారధులు

- గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ సమావేశంలో వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

గరుగుబిల్లి: గృహసారథులే వైఎస్సార్ సీపీ గెలుపు వారధులని పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్‌లో నిర్వహించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. మార్చి 18 నుంచి జరిగే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. మరోసారి ఇదే ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు అహర్నిశలు సైనికుల్లా కష్టపడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం



సారాతో పట్టుబడిన వ్యక్తి

సీతంపేట: మండలంలోని బుడగరాయి సెంటర్ వద్ద ఓ ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 10 లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నీలకంఠం శుక్రవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, బలిజిపేటకు చెందిన బి.జగదీష్‌ని పట్టుకుని, కేసు నమోదు చేశామన్నారు.

శైవక్షేత్రాల వద్ద పటిష్ట బందోబస్తు

పార్వతీపురం టౌన్: మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 18న ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శైవక్షేత్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ ఎ.సుభాష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం డివిజన్‌లో పలు శివాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూ మెయింటైన్ చేసేందుకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి సందర్భంగా పార్వతీపురం మండలం అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర, సాలూరులోని పంచముఖేశ్వర, పాచిపెంట మండలం పారమ్మకొండ, కొమరాడ మండలం గుంప సోమేశ్వర ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నదులు, కాలువలు, కోనేరు, స్నానాలు చేసే సమయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, జలాశయాల్లో మునిగి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



దుర్ఘటనలో నుజ్జునుజ్జు అయిన లారీల ముందు భాగాలు

కొమరాడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన ఘటన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న బాలురు వసతి గృహం వద్ద శుక్రవారం జరిగింది. పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళ్తున్న ఓ లారీ, రాయగడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న మరో లారీ ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. రెండు లారీల ముందు భాగాలు నుజ్జునుజ్జు కాగా, తెలంగాణలోని ఖమ్మం జిల్లా, మధిర ప్రాంతానికి చెందిన డ్రైవర్ ఎన్.గణేష్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, వైద్యసేవల నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారని ఎస్‌ఐ జగదీష్‌నాయుడు తెలిపారు.

యూనియన్ బ్యాంకు సిబ్బంది దాతృత్వం



మృతునికి కుటుంబ సభ్యులకు నగదు పత్రాలు అందిస్తున్న బ్యాంకు సిబ్బంది

పాలకొండ: స్థానిక యూనియన్ బ్యాంకు సిబ్బంది దాతృత్వం ప్రదర్శించారు. మేనేజర్ రవికిరణ్, సిబ్బంది కలిసి తమ వద్ద ఎంతో నమ్మకంగా పని చేసి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యకి కుటుంబానికి రూ.3.50 లక్షల ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. తుద్దలి గ్రామానికి చెందిన నందీశ్వరరావు(వెంకన్న) తాత్కాలిక పద్ధతిలో కొన్నేళ్లుగా బ్యాంకులో పనిచేస్తున్నారు. జనవరి నెలలో సింగన్నపాలెం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకన్న తీవ్రగాయాలపాలై, మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీధినపడిన ఆయన కుటుంబానికి ఆర్థికసాయం చేసి, ఆదుకునేందుకు ముందుకువచ్చారు. సిబ్బంది అంతా చందాలు వేసుకుని మరీ సేకరించిన నగదు మొత్తాన్ని మృతుని కూతురు రాఘవి పేరిట బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసి, డిపాజిట్ చేశారు. అనంతరం సంబంధిత బ్యాంకు బుక్, పత్రాలను వెంకన్న భార్య సత్యవతికి అందజేశారు.

డీసీసీబీ సేవలపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న నాబార్డు, డీసీసీబీ కౌన్సిలర్ తిరుమలరావు

మక్కువ: డీసీసీబీ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ బ్రాంచ్‌మేనేజర్ సుందర్రావు కోరారు. మండలంలోని శంబర గ్రామంలో పీఏసీఎస్ ఖాతాదారులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు మంచి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నాబార్డ్, డీసీసీబీ కౌన్సిలర్ పి.తిరుమలరావు మాట్లాడుతూ నాబార్డ్ సౌజన్యంతో, డీసీసీబీ ఆధ్వర్యంలో రైతులకు బ్యాంక్‌సేవలపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేవింగ్ అకౌంట్స్ తెరవడం, ఫిక్స్‌డ్ డిపాజిట్స్, రికరింగ్ డిపాజిట్స్, రూపేకార్డు ఏవిధంగా వినియోగించుకోవాలి, సోషల్‌సెక్యూరిటీ స్కీం వలన ఉపయోగాలను వివరించారు. డీసీసీబీ సూపర్‌వైజర్ సింహాచలం, పీఏసీఎస్ ప్రెసిడెంట్ గంజి లక్ష్మీనారాయణ, సెక్రటరీ అక్యాన శ్రీనివాసరావు, మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

వలసల నివారణకే 'ఉపాధి' పనులు



జియ్యమ్మవలస: వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు నివారించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తోందని ఎంపీడీఓ ఎస్. రమేష్ అన్నారు. మండలంలోని అర్నాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించిన ఆయన నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారినే పనుల్లోకి అనుమతించాలని, పనుల్లో లేని వారికి మస్తర్లు వేయవద్దన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్సా కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.